క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ కార్యాలయం ప్రారంభోత్సవం రేపు

బాడంగి: మండల కేంద్రంలో వైఎస్సార్‌ సీపీ కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరై, కార్యాలయం ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరై, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ టి.రామదాసు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఐదో తరగతిలో చేరేందుకు నాలుగో తరగతి, ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఇప్పటివరకు ఐదో తరగతికి సంబంధించి 124 మంది, ఇంటర్మీడియట్‌కు సంబంధించి, 86 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, లేదంటే ఆధార్‌, రేషన్‌కార్డులతో పాటు ఓ ఫొటోతో పాఠశాల/కళాశాలకు నేరుగా వచ్చి గానీ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న సీతారాములు వారు

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో శ్రీరామమందిరం వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ, లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం గ్రామస్తులతో హోమాలు, విశేష పూజలు చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో ఉన్న ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం 21వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు డేవిడ్‌, లివింగ్‌స్టన్‌, మధుసూదనరావు ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రీస్తుసందేశం చదివి వినిపించారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి, పంచిపెట్టారు.

రుణాల రికవరీకి చర్యలు




రైతులతో మాట్లాడుతున్న ఏపీఎం మంగమ్మ

వంగర: రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా రైతులు తీసుకున్న రుణాల రికవరీకి చర్యలు చేపట్టాలని ఎఫ్‌పీవో ఏపీఎం తెర్లి మంగమ్మ సూచించారు. మండలంలోని అరసాడ, వంగర, మగ్గూరు గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆమె రైతులు వాడుకున్న రుణాలు, వసూళ్లపై సమీక్షించారు. రుణాలు తీసుకున్న రైతులతో సకాలంలో వాయిదాలు చెల్లించేలా చూడాలన్నారు. ఆమె వెంట వెలుగు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నేడు రామాలయం ప్రారంభోత్సవం

వంగర: మండలంలోని శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవం శనివారం నిర్వహిస్తున్నారు. గ్రామస్తులంతా చందాలు వేసుకుని మరీ సేకరించిన డబ్బులతో మందిరం నిర్మాణం దాదాపు పూర్తి కాగా ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో మరిన్ని సదుపాయాల కల్పించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించామని జెడ్పీటీసీ కరణం రాధమ్మ, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ కరణం సుదర్శనరావు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడిగా ఆశపు వేణు



విజయనగరం: పార్టీ సంస్థాగత నియామకాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నగర పార్టీ అధ్యక్షుడిగా ఆశపు వేణును నియమిస్తూ అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విజయనగరం కార్పొరేషన్‌ కోఆప్షన్‌ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యక్షులుగా గొలగాన సాయిలక్ష్మి, బంగారు దేముడులకు అవకాశం కల్పించారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శులుగా బొద్దాన అప్పారావు, రెడ్డి పద్మావతి, జమ్మాన శ్రీనివాసరావులను.. కార్యదర్శులుగా కణిశెట్టి సుధాకర్‌, మొయిద ఆదినారాయణ, దువ్వ శ్రీను, తోట రాజశేఖర్‌, వర్రి పద్మావతి.. కోశాధికారిగా కాపుగంటి రమేష్‌లను నియమించారు. వీరితో పాటు మరో 15 మంది నాయకులకు కమిటీ ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా అవకాశం కల్పించారు.

లోకేశ్‌కు రాజకీయ పరిపక్వత లేదు..

- ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ చదవడమే ఆయన పని
- కనీస అవగాహన లేని మాటలతో అభాసుపాలు
- నియోజకవర్గంలోని అభివృద్ధి కనబడలేదా అని సూటిప్రశ్న
- నాలుగున్నరేళ్లలో సామాజిక విప్లవం తెచ్చిన గొప్పనాయకుడు సీఎం జగన్‌
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్‌, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ రాజేష్‌



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్‌, డాక్టర్‌ తలే రాజేష్‌

రాజాం సిటీ: రాజకీయ పరిపక్వత లేని వ్యక్తి నారా లోకేశ్‌ అని, అటువంటి వ్యక్తి నియోజకవర్గాలకు వస్తుంటే ప్రజల నుంచి కనీస ఆదరణ కూడా లభించడం లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌, వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ తలే రాజేష్‌లు విమర్శించారు. ఇదే విషయమై వారు స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 15వ తేదీన రాజాంలో నిర్వహించిన శంఖారావం సభలో రాజాం అభివృద్ధి చూడకుండా మాట్లాడడం ఆయన రాజకీయ పరిణతి ఏపాటిదో ప్రజలకు అర్థమైందని ఎద్దేవాచేశారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కే నీచ సంస్కృతి టీడీపీకి వెన్నతో పెట్టిన విద్యన్నారు. ప్రజానాయకుడు వస్తే ప్రజల నుంచి విశేష స్పందన రావాలే కానీ ఇచ్ఛాపురం నుంచి రాజాం వరకు జరిగిన లోకేశ్‌ సభలకు వందల సంఖ్యలో కూడా జనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. జన సమీకరణ చేసినప్పటికీ ప్రజలెవరూ రాకపోవడంతో ఆ ఫ్రస్ట్రేషన్‌లో ఏం మాట్లాడాలో తెలియక రాజాం..కు.. ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారన్నారని ఆ మాటలు విని, జనం నవ్వుకుంటున్నారన్నారు. రాజకీయాలపై అవగాహన లేకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను లోకేశ్‌ చదువుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌ సీపీ ఉమ్మడి కుటుంబమని, మా ఐక్యతను చూసి ఆయనకు మింగుడుపడడం లేదని, ఇక్కడి టీడీపీ అభ్యర్థిని ప్రకటించుకోలేని దుస్థితిలో టీడీపీ ఉందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి పాదాలకు దండం పెట్టి ఇంజినీరింగ్‌ కళాశాలకు భూ కేటాయింపులు చేసుకుని, ఇప్పుడు అనూహ్యమైన వ్యాఖ్యలు చేస్తున్న ఇక్కడి టీడీపీ ఇన్‌చార్జ్‌ కోండ్రు మురళి నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. లేకపోతే ప్రజలే గత ఎన్నికల్లో మాదిరిగా ఓడించి, బుద్ధిచెబుతారన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి ఇలా..

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు దళారులతో పనిలేకుండా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. 15 మండలాల ప్రజలకు అనువుగా ఉంటుందన్న సదుద్దేశ్యంతో రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చిన ఆలోచనను ప్రస్తుత సీఎం జగనన్న సాకారం చేశారని గుర్తుచేశారు. నియోజకవర్గంలో థర్డ్‌ పార్టీ లేకుండా డీబీటీ విధానం ద్వారా రూ.1100 కోట్లు, నాన్‌ డీబీటీ ద్వారా రూ.204 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారన్నారు. గ్రామస్వరాజ్యం స్థాపించే క్రమంలో నియోజకవర్గంలో 86 సచివాలయాలకు రూ.33.70 కోట్లు, 86 ఆర్‌బీకేలకు పక్కా భవనాల కోసం రూ.1766 కోట్లు కేటాయించి, నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యం అందించేందుకు 77 పీహెచ్‌సీల నిర్మాణానికి 17.66 కోట్లు, 22 పాలకేంద్రాల కోసం రూ.3.47 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. డిజిటల్‌ లైబ్రరీల కోసం రూ.3.84 కోట్లు, వంగర మండలంలోని రుషింగి–కిమ్మి వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లు, తోటపల్లి పాత రెగ్యులేటర్‌ నుంచి కుడి,ఎడమ కాలువల ఆధునికీకరణకు రూ.30 కోట్లు, మడ్డువలస రెగ్యులేటరీ మరమ్మతులకు రూ.8 కోట్లు మంజూరు చేసి, ఇరిగేషన్‌ శాఖ ద్వారా మరమ్మతులు చేయించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. గాయత్రికాలనీ నుంచి జీఎంఆర్‌ ఐటీ వరకు ప్రధాన రహదారికి రూ.20 కోట్లు, జీఎంఆర్‌ ఐటీ నుంచి సంకిలి సుగర్‌ ఫ్యాక్టరీ వరకు రూ.9 కోట్లు, ఉల్లివలస నుంచి గాయత్రికాలనీ వరకు రూ.3.10 కోట్లతో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించిన ఘనత కూడా వైఎస్సార్‌ సీపీ సర్కారుకే దక్కుతుందన్నారు. జగనన్న కాలనీల్లో 70 శాతం మేర నిర్మాణాలు పూర్తి చేయగా, 3200 మందికి ఇళ్లపట్టాలు అందించామన్నారు. ఇదంతా అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ టౌన్‌, రూరల్‌ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పొట్నూరు లక్ష్మణరావు, టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, వాకముళ్ల చిన్నారావు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్‌

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌

రాజాం సిటీ: వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ అన్నారు. స్థానిక పట్టణంలో వలంటీర్లతో శుక్రవారం సమావేశమైన ఆయన మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థతో తీర్చిన ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రజలకు పథకాలను చేరువచేయడంలో సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థలు ఎంతగానో కృషిచేశాయన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి వలంటీర్ల సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందిస్తుందన్నారు. అలాగే ఈ నెల 19వ తేదీన రాజాంలో పలు అభివృద్ధి పనులను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నారన్నారు. గతంలో ఒక ప్రభుత్వం శంకుస్థాపన చేస్తే మరో ప్రభుత్వం ప్రారంభించేదని, ఇప్పుడు అలా కాకుండా ఒకే ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన, ప్రారంభ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గతంలోని పాలనకు ఇప్పటి వైఎస్సార్‌ సీపీ హయాంలోని పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని ప్రతీ ఇంటికి వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ తలే రాజేష్‌, పార్టీ టౌన్‌ కన్వీనర్‌ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఆటోడ్రైవర్లు, సీఐటీయూ నాయకులు



బొబ్బిలి: ర్యాలీలో పాల్గొన్న వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు

రామభద్రపురం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆటోడ్రైవర్లు మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నేతలు బి.శ్రీను, పి.శంకరరావు మాట్లాడుతూ కేంద్రం ఐపీసీ సెక్షన్‌ 304(ఎ)ను రద్దు చేసి, సెక్షన్‌ 106(2)తో రెండేళ్ల శిక్షను ఐదేళ్లకు పెంచడం దారుణమని, ఇది ఆటోడ్రైవర్ల మెడకు ఉరితాడులాంటిదని విమర్శించారు. పెట్రోలు ధరలు తగ్గించాలని డిమాండ్‌ చేశారు. రవాణా రంగాన్ని కార్పొరేట్‌ కంపెనీలకు అప్పజెప్పాలనే ఆలోచన మానుకోవాలని హెచ్చరించారు. ఆటోవాలాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్‌ బొబ్బిలి, సాలూరు, బాడంగి రూట్ల ప్రెసిడెంట్‌లు సీహెచ్‌ లోకేష్‌, కె.వెంకటరావు, రామకృష్ణ, వైస్‌ ప్రెసిడెంట్‌ కె.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వ్యవసాయ, కార్మిక సంఘాలు స్థానిక పట్టణంలో శుక్రవారం ర్యాలీ చేపట్టాయి. భారత కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్‌ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన ఈ ర్యాలీలో వందలాది మంది రైతులు, కార్మికులు పాల్గొని, ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కలాసీ సంఘం నాయకులు బి.అప్పలస్వామి, వై.అప్పారావు, రామకృష్ణ, రైతు కూలీ సంఘం నాయకుడు రాజు, మోటార్‌ వర్కర్‌ యూనియన్‌ నాయకులు కె.శంకరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: పెంటలోని వేగావతి నదిలో పుణ్యస్నానమాచరించి, సూర్యనమస్కారాలు చేస్తున్న భక్తులు

సూర్యదేవా నమోస్తుతే

వాడవాడలా రథసప్తమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘశుద్ధ సప్తమి నాడు సూర్యభగవానుడి పుట్టినరోజు పురస్కరించుకుని, ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడం విశేషం. వేకువజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, సూర్యనమస్కారాలు చేశారు. ఆదిత్యుని ఆలయానికి వెళ్లి, రవితేజునికి ఇష్టమైన రేగుపండ్లను నైవేద్యంగా సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఇదేరోజున సూర్యుడిని ఆరాధిస్తే సకల దోషాలు తొలగి, సుఖసంతోషాలు కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. – సాక్షి నెట్‌వర్క్‌.



బాడంగి: కోదండరామాలయంలో రథసప్తమి పూజలు



రామభద్రపురం శివాలయంలో భక్తుల పూజలు

గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విజయనగరం: నగరంలోని ఎస్‌బీఐ మెయిన్‌ బ్రాంచ్‌ జంక్షన్‌ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఈ నెల 20న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించనున్నారని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

● ప్రజారోగ్యమే లక్ష్యం



రేగిడి: ఖండ్యాంలో వైద్యశిబిరానికి హాజరైన రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న సిబ్బంది

ప్రజారోగ్యమే లక్ష్యంగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం గ్రామగ్రామాన నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం పలు గ్రామాల్లో వైద్యశిబిరాలకు హాజరైన రోగులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం, శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాసుపత్రులకు రిఫర్‌ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఉన్న ఊరిలోనే నాణ్యమైన వైద్యసేవలు అందుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వంగర మండలంలోని బాగెంపేటలో రికార్డు స్థాయిలో 403 మంది వైద్య తనిఖీలు చేయించుకోవడం విశేషం. – సాక్షి నెట్‌వర్క్‌.



వంగర: బాగెంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యారోగ్య సిబ్బంది



బాడంగి: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది

సకాలంలో ప్రజలకు సేవలందించాలి

- వైఎస్సార్‌ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ తలే రాజేష్‌



వార్డు సచివాలయం సందర్శనలో డాక్టర్‌ తలే రాజేష్‌

రాజాం: ప్రజలకు సకాలంలో సేవలందించాలని వైఎస్సార్‌ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ తలే రాజేష్‌ సూచించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని 11వ వార్డు సచివాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి ఉద్యోగుల పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలన్న సదుద్దేశ్యంతో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని, ప్రతీ ఉద్యోగి చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం సచివాలయానికి వచ్చిన కొంతమందితో మాట్లాడి, సేవలు అందుతున్న తీరుపై ఆరాతీశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, స్పందన కార్యక్రమం ద్వారా సచివాలయం దృష్టికి వచ్చిన ప్రతీ ప్రజాసమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, యందవ చినబాబు, సత్యనారాయణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలి



గుయ్యానవలసలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీవో సాయిరాం



రేగిడి: ఫీల్డ్‌ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని ఏపీవో ఎస్‌.హరనాథరావు సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో ఫీల్డ్‌ అసిస్టెంట్లు, మేట్‌లతో శుక్రవారం సమావేశమైన ఆయన ఉపాధి పనులపై సమీక్షించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని, వేతనదారులతో రోజుకు రెండు పూటలా పనిచేయించి, గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, టెక్నికల్‌ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ఉపాధి హామీ పథకం పాల్గొంటున్న వారంతా రెండుపూటలా పనిచేయాలని ఏపీవో కె.సాయిరాం సూచించారు. మండలంలోని గుయ్యానవలస, బొమ్మినాయుడువలస, గురవాం గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు పరిశీలించి, జాబ్‌ కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనికి వచ్చిన వారికే మస్తరు వేయాలని, నిర్దేశిత కొలతల్లో రెండు పూటలా పనిచేయించాలని తెలిపారు. కార్యక్రమంలో టీఏ సత్యనారాయణ, ఫీల్డ్‌ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కమిషనర్‌ పర్యటన



పట్టణ పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్‌ కమిషనర్‌ ఎల్‌.రామలక్ష్మి శుక్రవారం పర్యటించి, అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా జరిగేలా చూడాలని, ప్రతీ వీధి పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించి, పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలని ప్రజలను కోరారు. ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా చెత్తాచెదారం వేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం పాతబొబ్బిలి జంక్షన్‌లోని గ్రంథాలయాన్ని సందర్శించి, ఎంతమంది పాఠకులు రోజూ వస్తున్నారన్న విషయంపై లైబ్రేరియన్‌ను ఆరాతీశారు.

ఎంపీడీవో రామకృష్ణ సేవలు ప్రశంసనీయం



బదిలీ ఎంపీడీవో రామకృష్ణను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్థు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్‌ బొమ్మి శ్రీనివాసరావు

తెర్లాం: మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ గర్భాపు లూర్థు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్‌ బొమ్మి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా సంతకవిటి మండలానికి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లిన ఎంపీడీవో రామకృష్ణను స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు వారు పనిచేసిన కాలంలో ప్రజలకు అందించిన నిస్వార్థ సేవలే వారికి గుర్తింపు తీసుకువస్తాయన్నారు. రామకృష్ణ పనిచేసిన నాలుగేళ్లలో మండలం అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుత ఎంపీడీవో మధుసూదనరావు మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అంతా కలిసి రామకృష్ణను ఇంత ఘనంగా సన్మానిస్తున్నారంటే ఆయన చేసిన సేవలు ఏమిటనేది అర్థమవుతుందన్నారు. తాను మండలంలో పనిచేసిన కాలంలో ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తనకు ఎంతగానో సహకరించారని, వారందరికీ ధన్యవాదాలని, బదిలీపై వెళ్లిన తనను మండలానికి పిలిచి మరీ గౌరవించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు, ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధులు ఎన్‌.బాబ్జీరావు, జి.రామారావు, ఎంఈవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని ముక్కాం, సవరవిల్లి, ముంజేరు, గూడెపువలస, రావివలస, అమటాం, దల్లిపేట, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, రావాడ, తూడెం, కవులవాడ, నందిగాం, రామచంద్రపేట పరిధిలో విద్యుత్‌ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మస్తాన్‌వలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మజ్జిగౌరమ్మ ఉత్సవాలు ప్రారంభం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో మజ్జిగౌరమ్మ 45వ జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ జాతర చేస్తున్నామని, భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేశామని సర్పంచ్‌ వాకముల్ల చిన్నంనాయుడు, కమిటీ సభ్యులు తెలిపారు.